రాష్ట్రాభివృద్ధికి

అడ్డుపడుతున్న కేంద్రం

స్పీకర్ అప్పావు ఆరోపణ



చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి అడుగడుగునా అడ్డుకుని, లేనిపోని ఆటంకాలు సృష్టిస్తోందని శాసనసభ స్పీకర్ అప్పావు ఆరోపించారు.తిరునల్వేలిలో బుధవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశ విదేశీ వ్యవహారాల విధానం బలహీనమై పోయిందని, పహల్గామ్ దాడులకు సంబంధించి పాకిస్తాన్‌ను ప్రపంచ దేశాలేవీ ఖండించలేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించినట్లు అన్నాడీఎంకే నేతలు ఆరోపిస్తున్నారని, తిరుప్పూరు వద్ద అన్నాడీఎంకే ఎమ్మెల్యేకి చెందిన తోటలో ఎస్సై దారుణహత్యకు గురయ్యారని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నదెవరో ఈ సంఘటన రుజువు చేస్తుందన్నారు. కలైంజర్ పేరుతో విశ్వవిద్యాలయం ఏర్పాటు బిల్లును గవర్నర్ అంగీకరించకపోవడం విచారకరమని, కొత్త విశ్వవిద్యాలయాలను ప్రారంభించే హక్కు రాష్ట్రానికి ఉందని, ఈ విషయం తెలిసినా గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి పంపడం గర్హనీయమన్నారు. డీఎంకే ప్రభుత్వం దక్షిణాది జిల్లాల అభివృద్ధిపై దృష్టి సారించడం లేదని ఆరోపించిన వారంతా విన్‌పాస్ట్ కార్ల కర్మాగారం ప్రారంభం, పెట్టుబడిదారుల సదస్సులో పలు కంపెనీలతో ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం చూసి విస్తుపోతున్నారన్నారు. గత నాలుగేళ్లలో రాష్ట్రం 11.19 శాతం ఆర్థికాభివృద్ధి సాధించినట్లు కేంద్ర ప్రభుత్వమే ప్రకటించిందని, ఈ విషయం కేంద్ర మంత్రి ఎల్.మురుగన్‌కు తెలియకపోవడం వింతగా ఉందన్నారు. విదేశీ పెట్టుబడుల సమీకరణ ద్వారా రాష్ట్రానికి అందిన నిధులను వివరాలను చెప్పాలని మురుగన్ డిమాండ్ చేయడం కూడా విడ్డూరంగా ఉందని, విదేశాల నుండి వచ్చే నిధులు కేంద్ర ప్రభుత్వ పరిశీలించిన మీదటే రాష్ట్రానికి అందుతాయన్న విషయం కూడా ఆయనకు తెలియదా అని స్పీకర్ అప్పావు ప్రశ్నించారు.



ఓ యువతికి ఉద్యోగ నియామకపత్రం అందజేస్తున్న ముఖ్యమంత్రి

యువతకే మా ప్రాధాన్యం

● సీఎం స్టాలిన్ ● 2538 మందికి ఉద్యోగ నియామకాలు

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్లకు పైగా ద్రావిడ తరహా డీఎంకే ప్రభుత్వం యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి అటు ప్రైవేటు సంస్థల్లో, ఇటు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగవకాశాలు కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. నందంబాక్కం ట్రేడ్ సెంటర్‌లో బుధవారం ఉదయం నగరపాలన, నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏఈలు, జేఈలు, టెక్నికల్ అసిస్టెంట్లు, డ్రాఫ్ట్‌మెన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ తదితర పోస్టులకు సంబంధించిన 2538 మందికి ఆయన నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. తమిళ సంస్కృతీ సంప్రదాయాలను, తమిళభాషను కాపాడాల్సిన బాధ్యత యువకులదేనని, వారి సంక్షేమం కోసమే ద్రావిడ తరహా డీఎంకే ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితే సరిపోదని, అన్ని వ ర్గాల వారిని కూడా ఉన్నత స్థితికి తీసుకెళ్ళాలని, అప్పుడే సమగ్రాభివృద్ధి సాధ్యపడుతుందని స్టాలిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర పరీక్షల విభాగం, సిబ్బంది ఎంపిక విభాగం ద్వారా ఇప్పటివరకూ 1.35 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. నాన్ ముదల్వన్ పథకం ద్వారా శిక్షణ పొందిన 89 మంది యువకులు కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఉద్యోగాలు చేస్తుండటాన్ని చూసి తానెంతో గర్వపడుతున్నానన్నారు. యువతకు విద్యనందిస్తే చాలదని, వారి అర్హతలకు సంబంధించి ఉద్యోగవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని, అందుకే రాష్ట్రంలో విదేశీ, స్వదేశీ పెట్టుబడులు సమీకరించి పలు కర్మాగారాలు నెలకొల్పి ఉద్యోగాలిస్తున్నామని తెలిపారు. గత నాలుగేళ్లలో 6.41 లక్షలమంది వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పొందారని ఆయన చెప్పారు. . రాష్ట్రంలో శాంతి భద్రతలు పటిష్ఠంగా ఉన్నాయని, పరిశ్రమలు నెలకొల్పేందుకు అనువైన పరిస్థితులున్నాయని, ఇలా రాష్ట్రం అభివృద్ధిపథంలో పయనిస్తుండటం చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలతో తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయని స్టాలిన్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు కేఎన్ నెహ్రూ, దామో అన్బరసన్, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియా, నగరపాలక శాఖ ముఖ్య కార్యదర్శి డి.కార్తికేయన్, కమిషనర్ జె.కుమార గురుబరన్ చెన్నై నీటి సరఫరా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

11.19 శాతానికి ఆర్థికపురోగతి...

డీఎంకే పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతోందని రుజువు చేసేలా ఆర్థిక పురోగతి 11.19 శాతానికి పెరిగిందని కేంద్ర వెల్లడించిన గణాంకాలే చెబుతున్నాయని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మేరకు తన ఎక్స్‌పేజీలో ఓ సందేశం పోస్టు చేస్తూ 14 యేళ్ల క్రితం డీఎంకే అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇదే రీతిలో ఆర్థిక ప్రగతి సాధించిందని, మళ్ళీ డీఎంకే అధికారంలోకి వచ్చాకనే ఈ పురోగతి సాధ్యమైందని, ఈ ఘనకీర్తి అంతా తనపై విశ్వాసముంచి గెలిపించిన తమిళ ప్రజలకే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు.

నీలగిరిలో భారీ వర్షం

ఊటీ రైల్వే వంతెన కింద వాననీటిలో వెళ్తున్న వాహనాలు



చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం వేకువజాము వరకూ భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు నీటమునిగాయి. జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం ఊటీ పరిసరాల్లోనూ చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. ఊటీ రైల్వే ఫ్లైఓవర్ దిగువన ఓ కారు వాననీటిలో మునిగింది. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వెళ్ళి కారును సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ వర్షాలకు ఊటీ గార్డెన్ రహదారి బురదమయంగా మారింది. బోట్‌హౌస్ ప్రాంతంలో వరద దృశ్యాలు నెలకొన్నాయి. పలు చోట్ల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఊటీ రైల్వేస్టేషన్ సమీపంలోని పోలీసుస్టేషన్‌లో మోకాలిలోతున వర్షపు నీరు వరదలా ప్రవహించింది.

పరువు హత్యలపై ప్రత్యేక చట్టం

● మంత్రి దురైమురుగన్

వేలూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పరువు హత్యలపై ప్రత్యేక చట్టం తీసుకురానున్నట్లు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి దురైమురుగన్ పేర్కొన్నారు. వేలూరు జిల్లా కట్పాడిలో జరిగిన మీతో స్టాలిన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం ప్రజలకోసం ఎప్పటికప్పుడు నూతన పథకాలను ప్రారంభించి అమలు చేస్తోందని, ఉంగళుడన్ స్టాలిన్ అనే వినూత్న పథకం ద్వారా ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించేలా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో పరువు హత్యలు పెరుగుతున్న నేపథ్యంలో, వాటిని అరికట్టేందుకు సీఎం స్టాలిన్‌తో చర్చించి కొత్త చట్టాన్ని తీసుకొస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్, కార్పొరేషన్ జోనల్ అధ్యక్షురాలు పుష్పలత వన్నియరాజా సహా పలుశాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న మంత్రి దురైమురుగన్



అలనాటి సదనం..

నేడు శిథిలం

● శిథిలావస్థలో తొలి మహిళా వైద్యురాలి నివాసం

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొట్టమొదటి మహిళా వైద్యురాలిగా పేరొందిన ధీశాలి డాక్టర్ ముత్తులక్ష్మి రెడ్డి నివాసం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. చుట్టూ అడవిని తలపించేలా చెట్లు, మట్టిదిబ్బలు, సంచరించే పాముల మధ్య శిథిలావస్థకు చేరిన ఆ భవనాన్ని చూస్తే స్వాతంత్ర్యానికి పూర్వం 1936 నుంచి మూడు దశాబ్దాల పాటు డాక్టర్ ముత్తులక్ష్మి రెడ్డి నివశించేవారంటే ఎవ్వరూ నమ్మలేరు. అడయార్‌లోని బీసెంట్ అవెన్యూలో ఈ భవనం వున్న ప్రాంగణం తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వరాలయానికి చెందినదని స్థానికులు చెబుతున్నారు. అంత ఖరీదైన ఆ స్థలానికి కనీసం కాంపౌండ్‌వాల్ కూడా లేకపోవడం విచారకరం. ప్రస్తుతం ఆ భవనంలోకి అసాంఘిక శక్తులు ప్రవేశిస్తున్నాయని, మందుబాబులకు అడ్డాగా మారిందని కొంతమంది స్థానికులు వాపోతున్నారు.

ఎంతోమందికి ఆశ్రయం కల్పించడం కల్పించేందుకు గాను 'అవ్వై హోం, తమ కోసం ఇల్లు నిర్మించాలనుకున్న డాక్టర్ ముత్తులక్ష్మి రెడ్డి.. అరుణాచలేశ్వరాలయం నుంచి భూమి లీజుకు తీసుకోవంతో పాటు ఆ పక్కనే మరికొంత భూమి కూడా పొందారు. ఇక్కడ ఎంతోమంది యువతులు నర్సులు, ఉపాధ్యాయులుగా మారి దేశభవిష్యత్తుకు బాటలు వేసిన విషయం తెలిసిందే. స్వాతంత్ర్యానికి పూర్వం, అంటే 1942లో అడయార్ నదీ తీరంలో విడిది చేసిన కొంతమంది సైనికులు బాలికలను వేధించే సాహసం చేయగా, ఆమె బాధితులకు అండగా నిలిచారు. ప్రస్తుతం అడయార్‌లో వున్న క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణానికి పునాదులు పడడంలో ఆమె కృషి ఎనలేనిది.

ఆమె నివాసం నిర్వహణకు అవసరమైన అనుమతులను అవ్వై హోమ్ ఫర్ గర్ల్స్, క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లకు గతంలోనే హైకోర్టు అప్పగించింది. వేలాది మంది బాలికలు, మహిళలకు డాక్టర్ ముత్తులక్ష్మి రెడ్డి చేసిన సేవలకు గుర్తుగా, ఈ ఇంటిని స్మారక చిహ్నంగా పునరుద్ధరించాలని వైద్యులు, విద్యావేత్తలు, మహిళా సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి. నిజానికి అవ్వై హోం, అడయార్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఈ భవనాన్ని పునరుద్ధరించేందుకు సుముఖంగా వున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ దిశగా త్వరితగతిన అడుగులు పడితే ఆ స్మారక భవనాన్ని కాపాడుకున్నవాళ్లమవుతాం.

విజయ్‌కాంత్ ఫొటో ఏ పార్టీ వాడకూడదు

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత



ప్యారీస్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డీఎండీకే వ్యవస్థాకులు దివంగత విజయ్‌కాంత్ ఫొటోను ఏ రాజకీయ పార్టీ వాడకూడదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత హెచ్చరించారు. జిల్లాస్థాయిలో డీఎండీకే బలోపేతం కోసం ప్రేమలత రాష్ట్ర వ్యాప్త పర్యటన ప్రారంభించారు. బుధవారం వేలూరులో ఆమె మీడియాతో మాట్లాడుతూ, రాజకీయ పార్టీలు విజయ్‌కాంత్ ఫొటోలు వాడకూడదని, ఎన్నికల సమయంలో కూటమి ఏర్పడినట్లయితే వాడుకోవడంలో తమకు ఎలాంటి అభ్యంతరం ఉండదన్నారు. అయితే సినిమాలకు ఇది వర్తించదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, దీనిని సక్రమైన దారిలో తీసుకెళ్ళడంలో ముఖ్యమంత్రి స్టాలిన్ విఫలమైయ్యారన్నారని ఆమె ఆరోపించారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలేవీ?

● ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఈపీఎస్

ప్యారీస్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏమయ్యాయని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ప్రశ్నించారు. 2026లో అసెంబ్లీకి జరుగనున్న ఎన్నికలను పురస్కరించుకుని రాష్ట్రప్రజలను ప్రత్యేకంగా కలుసుకునేందుకు 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంలో ఈపీఎస్ చేపట్టిన ప్రచారయాత్ర బుధవారం తెన్‌కాశి నియోజకవర్గం అంబాసముద్రంలో జరిగింది. ఈ సందర్భంగా మాజీ సీఎం ఒ.పన్నీర్‌సెల్వం వర్గానికి చెందిన వంద మందికి పైగా మద్దతుదారులు ఈపీఎస్ వర్గంలో చేరారు. వారిని ఈపీఎస్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో డీఎంకే పాలనలో ప్రతిరోజు హత్యలు, లైంగిక వేధింపుల, దొంగతనాలు జరుగుతున్నాయని, వాటిని అడ్డుకోవడంలో పోలీసుశాఖ విఫలమైందని విమర్శించారు. తిరుప్పూర్ జిల్లాలో తండ్రికొడుకుల మధ్య జరిగిన గొడవను అడ్డుకునేందుకు వెళ్ళిన ఎస్‌ఐ దారుణహత్యకు గురికావడం, అలాగే కోవై పోలీస్ స్టేషన్‌లో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనలతో రాష్ట్రప్రజానీకం భయాందోళనలకు గురవుతున్నారని ఆరోపించారు. శాంతిభద్రతలు ఏమైపోయాయో సీఎం స్టాలిన్ సమాధానం చెప్పాలని ఈపీఎస్ డిమాండ్ చేశారు. ప్రజలను కాపాడేందుకు, అవినీతిపరుల నుండి రాష్ట్రాన్ని విడిపించేందుకు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమిని మెజారిటీ స్థానాల్లో గెలిపించి డీఎంకే ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని రాష్ట్రప్రజలకు విజ్ఞప్తి చేశారు.



అన్నాడీఎంకేలో చేరిన ఓపీఎస్ మద్దతుదారులతో ఎడప్పాడి పళనిస్వామి

చోళుల కాలంనాటి విగ్రహాలు లభ్యం

వేలూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా అబ్దుల్లాపురం సమీపంలోని అన్నూండి ప్రాంతంలో చోళరాజుల కాలంనాటి నాలుగు పంచలోహ విగ్రహాలు బయటపడ్డాయి. ఆ ప్రాంతంలోని తిరుథళీశ్వరాలయ పునరుద్ధరణ పనుల్లో భాగంగా తవ్వకాలు చేపట్టారు.. ఆ సమయంలో గుంతలో విగ్రహాలను గమనించిన స్థానికులు వాటిని బయటకు తీశారు. బాల సుబ్రహ్మణ్యస్వామి, తాండవ వినాయక, శివగామి అమ్మన్, ప్రదోష విగ్రహాలుగా వాటిని గుర్తించి, శుభ్రం చేసి గ్రామస్తులు పూజలు చేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పురావస్తు పరిశోధన విభాగ అధికారులు అక్కడికి చేరుకుని విగ్రహాలను పరిశీలించి ఇది చోళరాజుల కాలంనాటివిగా నిర్ధారించారు. అనంతరం వాటిని స్వాధీనం చేసుకుని జిల్లా పురాతన విగ్రహాల సంరక్షణా కేంద్రానికి తరలించారు.



బయల్పడిన పంచలోహ విగ్రహాలు

9న అన్బుమణి నేతృత్వంలో

పీఎంకే సమావేశం

● స్టే కోరుతూ కోర్టును ఆశ్రయించిన రాందాస్

ప్యారీస్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పీఎంకే మాజీ ఎంపీ అన్బుమణి నేతృత్వంలో ఈ నెల 9న చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలో నిర్వహించనున్న పీఎంకే సర్వసభ్య సమావేశానికి స్టే విధించాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో అన్బుమణి తండ్రి, పీఎంకే వ్యవస్థాపకులు డాక్టర్ రాందాస్ పిటిషన్ వేశారు. పీఎంకే నిర్వహణ, పార్టీ నేతల నియామకం వ్యవహారంలో తండ్రి,తనయుల మధ్య గత మూడు నెలలుగా వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. వారిని బుజ్జగించేందుకు పార్టీ సీనియర్లు చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదు. పార్టీ అధ్యక్షుడిని తానేనని ఇటీవల రాందాస్ ప్రకటించారు. అంతటితో ఆగకుండా అన్బుమణిని పీఎంకే అధ్యక్షపదవి నుంచి తొలగించి ఆయనకు పార్టీతో ఎలాంటి సంబంధాలు లేవని తెలిపారు. తండ్రికొడుకుల మధ్య ప్రకటనల యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో, ఆ పార్టీ ప్రస్తుతం రెండు వర్గాలుగా విడిపోయింది. ఈ నెల 9వ తేదీ మహాబలిపురంలో అన్బుమణి అధ్యక్షతన నిర్వహించదలిచిన పీఎంకే సర్వసభ్య సమావేశానికి స్టే విధించాలని కోరుతూ రాందాస్ తరుఫున బుధవారం మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ త్వరలో విచారణకు రానున్నట్లు కోర్టు వర్గాలు తెలిపాయి.

నీతి, నిజాయితీలే

మనిషిని ఉన్నతస్థానంలో నిలబెడతాయి



డాక్టర్ లలితకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

● డాక్టర్ జి.లలిత

అడయార్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నీతి నిజాయితీ, ధర్మం, విధేయతలే మనిషిని ఉన్నతస్థాయికి తీసుకువెళ్లాయని చెన్నై ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు డాక్టర్ జి.లలిత పేర్కొన్నారు. నగర శివారు ప్రాంతమైన పట్టాభిరాంలోని ధర్మమూర్తి రావు బహదూర్ కలవల కన్నన్ చెట్టి హిందూ కళాశాలలో ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ విభాగంలో అంతర్భాగమైన "విలువలతో విద్య" తరఫున బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. ఇందులో ఆమె 'వృత్తి జీవితంలో విలువలు' అనే అంశంపై ప్రసంగించారు. ఎలాంటి వృత్తిలో ఉన్నప్పటికీ విలువలు పాటించాలన్నారు. సత్యహరిశ్చంద్రుడు చక్రవర్తి నుంచి కాటికాపరి స్థాయికి దిగజారినా తన విలువలను మాత్రం ఏనాడు త్యజించలేదన్నారు. అలాగే, భారతీయ సాహిత్యంలోని కొన్ని కథలను ఆమె ఉదహరిస్తూ విద్యార్థులకు తెలియజెప్పారు. అలాగే కాలేజీ వ్యవస్థాపక దంపతుల దాన ధర్మాలను ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముందుగా హిందీ శాఖ అధ్యక్షురాలు డాక్టర్ జైనబీ అతిథులకు స్వాగతం పలికారు. ఆర్థిక శాఖ అధ్యాపకురాలు డాక్టర్ వి.సుజాత, కళాశాల ప్రధాన అధ్యాపకురాలు డాక్టర్ జి.కళ్విక్కరసి, కళాశాల సంచాలకులు డాక్టర్ ఎస్.రాజేంద్రనాయుడు, తెలుగుశాఖ అధ్యాపకురాలు డాక్టర్ తుమ్మపూడి కల్పన, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమాచార దర్శిని

కుష్ఠు రోగుల గణన ప్రారంభం

ప్యారీస్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కుష్ఠు రోగుల జనగణనను రాష్ట్రప్రభుత్వం ప్రారంభించింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ మంజూరు చేసిన నిధులతో రాష్ట్రవ్యాప్తంగా 38 జిల్లాల్లో కుష్ఠు రోగులను గుర్తించి వారికి ప్రభుత్వం తరుపున ఉచితంగా వైద్యం అందించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సిబ్బంది ఇంటింటికీ వెళ్ళి కుష్ఠు రోగ లక్షణాలున్న వారిని గుర్తించి ప్రాథమిక వైద్య పరీక్ష చేయిస్తున్నారు. సర్వే జరిపిన ఇళ్లకు సీక్రెట్ కోడ్ నంబర్ కేటాయిస్తున్నారు. కుష్ఠు రోగులకు తదుపరి వైద్యపరీక్షలు నిర్వహించే తేదీలని సెల్‌ఫోన్ నెంబర్లకు మెస్సేజ్ ద్వారా పంపుతున్నట్లు అధికారులు తెలిపారు.

వరల్డ్ చెస్ పోటీలు వాయిదా

అడయార్,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి):నగరంలో బుధవారం నుంచి జరగాల్సిన వరల్డ్ చెస్ పోటీలు వాయిదాపడ్డాయి.ఈ పోటీలు జరగాల్సిన హోటల్‌లో అగ్నిప్రమాదం సంభవించడంతో ఈ పోటీలను తాత్కాలికంగా వాయిదా వేశారు. ఈ పోటీలు జరిగే హోటల్‌లోనే జాతీయ, అంతర్జాతీయ ఆటగాళ్ళు బస చేస్తుండటం గమనార్హం.

20 నుంచి బ్యాంకు పరీక్షల శిక్షణ ప్రారంభం

ప్యారీస్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి సమీపంలోని తిరుచెందూరులోని శివంది అకాడమీ ఆధ్వర్యంలో బ్యాంకు పరీక్షలకు ఆన్‌లైన్ శిక్షణా తరగతులు ఈ నెల 20న ప్రారంభం కానున్నారు. ఐబీపీఎస్ దేశవ్యాప్తంగా 11 జాతీయ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న సుమారు 10,277 పోస్టు భర్తీ నిమిత్తం పరీక్షలు నిర్వహిస్తోంది. ఈ పరీక్షలు రాసేందుకు ఈనెల 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే గడువుంది. డిగ్రీ అర్హత ఉన్న జనరల్ కేటగిరి (ఓసీ)కి చెందిన 20 నుండి 28యేళ్లలోపువారు, ఓబీసీలో 31యేళ్లలోపున్నవారు, ఎస్సీఎస్టీలు 31యేళ్లలోపున్నవారు ఈ పరీక్షకు అర్హులు. ఈ పరీక్షలకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా శిక్షణ తరగతులు ఈ నెల 20న ప్రారంభమై 45 రోజులు కొనసాగుతాయి. అభ్యర్థులు దరఖాస్తులను https:// www.ibps.in అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వివరాలకు 04639-242998, 9443178481 అనే ఫోన్ నెంబర్లను సంప్రదించి తెలుసుకోవచ్చని శివంది అకాడమీ ఆర్గనైజర్ ఫ్రాన్సిస్ రేజుల తెలిపారు.

వ్యాపారి ఇంటి విద్యుత్ బిల్లు రూ.91,993!

ప్యారీస్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్ వెస్ట్ సమీపంలోని పాడి తిరువల్లీశ్వరనగర్‌లో నివసిస్తూ కిరాణా షాపు నడుపుతున్న నందకుమార్ ఇంటికి రూ.91,993 విద్యుత్ బిల్లు రావడం కుటుంబ సభ్యులను ఆందోళనకు గురిచేశాయి. నందకుమార్ ఇంట్లోనే దుకాణం నడుపుతున్న నేపథ్యంలో, ప్రతి రెండు నెలలకు 450 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్నారు.. ఇందుకు రూ.1,500 నుండి రూ.2000 వరకు విద్యుత్ ఛార్జీ చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం జూలై నెలకు సంబంధించి తీసిన రీడింగులో 8,370 యూనిట్ల విద్యుత్ వినియోగానికి గానూ రూ.91వేలకు పైగా విద్యుత్ ఛార్జీ చెల్లించాలంటూ వచ్చిన బిల్లుపై అన్నానగర్‌లో ఉన్న తమిళనాడు విద్యుత్ బోర్డు కార్యాలయ అధికారికి నందకుమార్ ఫిర్యాదు చేశారు.

కొండ ప్రాంతాల్లో రూ.500 కోట్లతో రోడ్లు

ప్యారీస్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొండలపై నివసిస్తున్న ప్రజలకు రూ.500 కోట్లతో రోడ్డు సదుపాయాలు కల్పించనున్నట్లు అటవీశాఖ మంత్రి రాజకన్నప్పన్ పేర్కొన్నారు. ఆయన బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, అటవీశాఖలో పనిచేస్తున్న 108 మంది అధికారులలో 80 మంది ఉత్తరాది రాష్ట్రాలకు చెందినవారని, వీరికి తమిళంలో వచ్చే ఫిర్యాదులను సులువుగా అర్థంచేసుకునేలా శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. రవాణా సదుపాయం లేని గిరిజన ప్రాంతాలు, కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు, పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా రాష్ట్రప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు, అదేవిధంగా రూ.500 కోట్లతో రహదారి వసతి కూడా కల్పించడంపై పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

'స్మార్ట్ మీటర్ల' కొనుగోలుకు టెండర్ ఆహ్వానం

ప్యారీస్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లలో ఉన్న విద్యుత్ కనెక్షన్లకు రూ.3.04 కోట్ల 'స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసేందుకు కాంట్రాక్ట్ సంస్థను టీఎన్ ఈబీ ఎంపిక చేయనుంది. తమిళనాడు విద్యుత్ బోర్డు విడుదల చేసిన టెండర్ నోటీసుకు 42 సంస్థలు పోటీ పడుతున్నాయి. ప్రతి రెండు నెలలకు ఒకసారి విద్యుత్ మీటర్ రీడింగ్ నమోదు చేసేందుకు ఆయా జిల్లాల్లో ఉన్న టీఎన్‌ఈబీ బిల్లు కలెక్టర్లు ఇళ్లకు వెళుతుంటారు. దానికి ఉద్యోగులు లేకుండా మీటర్ రీడింగ్‌కు స్మార్ట్ మీటర్ పథకాన్ని టీఎన్‌ఈబీ పరిచయం చేయనుంది. ఇందు కోసం 6 విభాగాలుగా 3 కోట్ల విద్యుత్ కనెక్షన్లకు, 4.94 లక్షల విద్యుత్ వినియోగ ట్రాన్స్‌ఫార్మర్లలో స్మార్ట్ మీటర్లు పొందుపరచనుంది. టీఎన్‌ఈబీ నిర్వహణలోని అన్ని జోనల్ కార్యాలయాల్లో ఈ నెల చివరి వరకు సమర్పించే టెండర్లను పరిశీలించి సెప్టెంబర్ రెండో వారం నుంచి స్మార్ట్ మీటర్లు పొందుపరిచే పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు టీఎన్‌ఈబీ అధికారులు తెలిపారు.

పుదుకోటలో రామేశ్వరం-బనారస్ రైలుకు హాల్ట్

ప్యారీస్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా రామేశ్వరం నుంచి బనారస్ వరకు నడిపే వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఇకనుంచి పుదుకోట రైల్వేస్టేషన్‌లో ఆగివెళ్తుందని దక్షిణ రైల్వే ప్రకటించింది. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రతి బుధవారం రాత్రి 11.55 గంటలకు రామేశ్వరం నుంచి బనారస్‌కు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను దక్షిణ రైల్వే నడుపుతోంది. ఈ రైలు అదనంగా పుదుకోట రైల్వేస్టేషన్‌లో ఆగివెళ్లేందుకు రైల్వే బోర్డు అనుమతించింది. ఆ ప్రకారం తెల్లవారుజామున 3.33 గంటలకు పుదుకోట రైల్వేస్టేషన్‌లో ఆ రైలు రెండు నిమిషాలు ఆగి 3.35 గంటలకు బయలుదేరుతుంది. ఇక తిరుచ్చికి ఎప్పటిలాగే ఉదయం 5 గంటలకు చేరుకుని 5.25 గంటలకు బయలుదేరుతుంది. ఈ మార్పు బుధవారం నుంచి అమలులో ఉంటుందని దక్షిణ రైల్వే తన ప్రకటనలో తెలిపింది.

10న గీతారామం ప్రవచనం

ప్యారీస్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ వెంకటరామన్‌వీధి సమీపంలోని పీఆర్‌సీసీ ఆధ్వర్యంలో ఈనెల 10న 'గీతారామం' తెలుగు ప్రవచన కార్యక్రమం జరగనుంది. సాధన పేరుతో ఆదివారం సాయంత్రం 6.05 నుంచి పీఆర్‌సీసీ సెంటినరీ హాలులో గీతారామం అంశంపై బాలకాండ పద్యానువాదకులు, సంపూర్ణ వాల్మీకి రామాయణం ఆడియోకర్త అవధాని కోట రాజశేఖర్ ప్రవచించనున్నారు.ఈమేరకు పప్పిచెట్టి రాఘవయ్య చెట్టీస్ ఛారిటీస్ ప్రెసిడెంట్ కోట సుధాకర్, ట్రస్టీలు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

రాయపురం తాత్కాలిక బస్‌స్టేషన్‌లో ట్రయల్ రన్



ప్యారీస్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపురం నియోజకవర్గంలో క్లైవ్ బ్యాటరీ సమీపంలో సిద్ధమైన తాత్కాలిక బస్ స్టాండులో చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) అధికారులు మంగళవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రస్తుతం మద్రాస్ హైకోర్టు సమీపంలో ఉన్న బ్రాడ్‌వే బస్‌స్టేషన్ ప్రాంగణంలో విద్యుత్ రైలు, మెట్రోరైలు తదితర రవాణా వసతులతో, వాణిజ్య కాంప్లెక్స్‌లతో కూడిన కేంద్రాన్ని రూ.650 కోట్లతో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధంచేశారు. ఈ పనులను చెన్నై మెట్రో రైల్వే (సీఎంఆర్‌ఎల్) సంస్థ త్వరలో ప్రారంభించనుంది. ఇందుకోసం బ్రాడ్‌వే బస్‌స్టేషన్ నుండి ప్రస్తుతం నడుపుతున్న బస్సులను రాయపురంలో సిద్ధంచేసిన తాత్కాలిక బస్‌స్టేషన్ నుంచి త్వరలో నడిపే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక్కడినుంచి ఎంటీసీ అధికారులు రెండు బస్సులకు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, ఈ తాత్కాలిక బస్‌స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంల్లో ఒకే సమయంలో ఎన్ని బస్సులు నడపొచ్చు, అదనపు బస్సులు నడిపేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సంబంధించిన నివేదికను ఎంటీసీ యాజమాన్యంకు సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా ఇక్కడి నుంచి బస్సులు నడిపే తేదీలను ఎంటీసీ సంస్థ అధికారికంగా ప్రకటిస్తుందని అధికారులు తెలిపారు.

రూ.100 కోట్లతో జల్లికట్టు స్టేడియం అవసరమా?

● రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించిన సీపీఎం నేత షణ్ముగం

ప్యారీస్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా అలంగానల్లూరులో ఏడాదిలో ఒక్కరోజు మాత్రమే నిర్వహించే జల్లికట్టు పోటీల కోసం రూ.100 కోట్లు వెచ్చించి స్టేడియం నిర్మించాలని ఎవరు కోరారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తమిళనాడు చెరకు రైతల సంఘం, సీపీఎం సంయుక్త ఆధ్వర్యంలో అలంగానల్లూరులో మూసివేసిన జాతీయ సహకార షుగర్ ఫ్యాక్టరీని పునప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ధర్నా జరిగింది. ఇందులో పాల్గొన్న షణ్ముగం మాట్లాడుతూ, మూసివున్న అలంగానల్లూరు షుగర్ ఫ్యాక్టరీని ప్రారంభించేందుకు రూ.50 కోట్లు విడుదల చేయని రాష్ట్రప్రభుత్వం ఒక్కరోజు నిర్వహించే జల్లికట్టు పోటీ కోసం రూ.100 కోట్లతో స్టేడియం నిర్మించడం అవసరమా? అని ప్రశ్నించారు.

సోలార్ పవర్‌తో వ్యవసాయం

● నాబార్డ్ ప్రకటన

ప్యారీస్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మోటారు పంపుల అవసరం లేకుండా సౌర విద్యుత్‌తో పంటలు సాగుచేసేందుకు సహకారం అందించనున్నట్లు నాబార్డ్ బ్యాంకు తమిళనాడు చీఫ్ జనరల్ మేనేజర్ ఆనంద్ పేర్కొన్నారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ, వంద ఎకరాలలో సౌర విద్యుత్‌తో 'మైక్రో క్లైమెట్' అనే పరికరం ద్వారా సాగు నిర్వహణకు ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు అదనంగా ఆదాయం పొందేందుకు ఈ పథకం సహకరిస్తుందని, వ్యవసాయం విశ్వవిద్యాలయాలతో కలిసి ఈ పథకాన్ని అమలుపరచనున్నట్లు ఆనంద్ తెలిపారు.

75 శాతం హాజరుంటేనే పబ్లిక్ పరీక్షకు అర్హత

● సీబీఎస్‌ఈ ఉత్తర్వులు

ప్యారీస్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): టెన్త్, ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షలు రాసేందుకు 75 శాతం హాజరున్న విద్యార్థులను మాత్రమే అనుమతించనున్నట్లు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ప్రకటించింది. సీబీఎస్‌ఈ నిర్వహణలో రాష్ట్రంలో ఉన్న విద్యాసంస్థలకు బుధవారం పంపించిన సర్క్యులర్‌లో వివరాలిలా ఉన్నాయి. సీబీఎస్‌ఈ పాఠశాలల్లో టెన్త్, ప్లస్‌టూ చదువుకుంటున్న విద్యార్థులకు విద్యాసంవత్సరంలో 75శాతం హాజరు ఉండాలని తెలిపింది. అనారోగ్యానికి గురైన వారు, జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులు, ఇతర కారణాలతో వెళ్ళే విద్యార్థులు దానికి సంబంధించి ధ్రువీకరణ పత్రాన్ని సమర్పిస్తే అటెండెన్స్ నుండి 25 శాతం రాయితీ కల్పించాల్సిందిగా ఆ పాఠశాలలకు సీబీఎస్‌ఈ ఉత్తర్వులు జారీచేసింది.

పారిశుధ్య కార్మికుల సమ్మెకు గాయని చిన్మయి మద్దతు



పారిశుధ్య కార్మికులను పలకరిస్తున్న గాయని చిన్మయి

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ జోన్ల వారీగా పారిశుధ్య పనుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ 5, 6 జోన్లకు చెందిన పారిశుధ్య కార్మికులు చేస్తున్న ఆందోళన ఆరోరోజుకు చేరింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ప్రముఖ గాయని చిన్మయి ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులను పరామర్శించి మద్దతు ప్రకటించారు. ఆ తర్వాత 500 లీటర్ల వాటర్ బాటిల్స్‌ను కార్మికులకు పంపిణీ చేశారు.

● జెండా స్తంభాలు తొలగించాలి...
హైకోర్టులో అన్నాడీఎంకే పిటిషన్

ప్యారీస్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జెండా స్తంభాలు తొలగించే చర్యలకు స్టే విధించాలని కోరుతూ దాఖలైన కేసులో అన్నాడీఎంకే తరుపున హైకోర్టు మదురై బెంచ్‌లో మధ్యంతర పిటిషన్ దాఖలైంది. మదురై పలంగానత్తం బైపాస్ రోడ్డు జయం థియేటర్ సమీపంలో బస్‌స్టాప్‌లో అన్నాడీఎంకే జెండా స్తంభం ఏర్పాటుకు అనుమతించేలా ఉత్తర్వులివ్వాలని ఆ పార్టీకి చెందిన కదిరవన్ పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు మదురై బెంచ్ న్యాయమూర్తి ఇళంద్రియన్, జాతీయ రాష్ట్ర రహదారుల్లో, ప్రభుత్వ శాఖలకు చెందిన స్థలాల్లో రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, మత సంస్థలు ఏర్పాటు చేసిన జెండా స్తంభాలను తొలగించాలని ఉత్తర్వులు జారీచేశారు. దీంతో రహదారులశాఖ అధికారులు పలంగానత్తం ప్రాంతంలో జెండా స్తంభాలను తొలగించకుండా స్టేవిధించాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తి సి.శరవణన్ తోసిపుచ్చుతూ జారీచేసిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ షణ్ముగం అప్పీలుకు వెళ్ళారు. ఈ నేపథ్యంలో, గత నెల 22న జెండా స్తంభాల తొలగింపుపై దాఖలైన కేసులపై విచారణ జరిపిన ముగ్గురు న్యాయమూర్తుల బెంచ్ ఈ కేసులో చేరేందుకు ఆగస్టు 5వ తేదీ వరకు రాజకీయ పార్టీలు పిటిషన్ వేసుకునేందుకు అవకాశం కల్పించారు. దీంతో అన్నాడీఎంకే తరుపున మాజీ మంత్రి ఆర్బీ ఉదయ్‌కుమార్ మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై త్వరలో విచారణ జరపనున్నట్లు కోర్టు వర్గాలు తెలిపాయి.

పరువు హత్యల అడ్డుకట్టకు ప్రత్యేక చట్టం

కాంగ్రెస్ ఎంపీ రంజన్ కుమార్ వినతి ● సత్యమూర్తి భవన్‌లో నిరాహారదీక్ష



నిరాహారదీక్షలో కాంగ్రెస్ నేతలు

అడయార్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరువు హత్యలు నానాటికీ పెరిగిపోతున్నాయని, వీటిని అరికట్టేందుకు ప్రత్యేక చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు, ఎంపీ రంజన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఆయన సారథ్యంలో బుధవారం రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయమైన సత్యమూర్తి భవన్‌లో నిరాహారదీక్ష జరిగింది. ఇందులో ఆయనతో పాటు అనేక పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రోజురోజుకూ పరువు హత్యలు పెరిగిపోతున్నాయనే వాస్తవాన్ని గ్రహించి, బాధితులకు ఆర్థిక సాయంతో పాటు ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలన్నారు. అంటరానితనం, కుల ఘర్షణలు అధికంగా ఉండే జిల్లాలను గుర్తించి అదనపు పోలీస్ భద్రత కల్పించడంతో పాటు ప్రత్యేక పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నిరాహారదీక్షకు వీసీకే ఎమ్మెల్యే ఎస్ఎస్ బాలాజీ మద్దతు తెలిపారు. అలాగే, కాంగ్రెస్ నేతలు రాజేష్ కుమార్, తమిళ్ సెల్వన్, రామ మోహన్, ఆరుముగం, ఎస్సీ దురైలతో పాటు అనేకమంది ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు.

వ్యాపారి వద్ద నగల చోరీ

● కిలేడి సహా ప్రియుడి అరెస్టు

అడయార్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యాపారితో అత్యంత సన్నిహితంగా మెలుగుతూ ఓ రాత్రి హోటల్ గదిలో ఏకాంతంగా గడిపిన ఓ యువతి ఆ వ్యాపారి వద్ద ఉన్న 10 సవర్ల బంగారు నగలను చోరీ చేసి పారిపోయింది. ఈ నగలను కుదువపెట్టి తన ప్రియుడికి ఖరీదైన బైకు కొనివ్వడంతో పాటు సేలం జిల్లా ఏర్కాడుకు విహార యాత్రకు వెళ్ళారు.ఆ కిలేడీని పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు ఆవడి కామరాజర్ నగర్‌కు చెందిన మణి అనే వ్యక్తికి దీపలక్ష్మి అనే యువతి పరిచయమైంది. వీరిద్దరూ కోడంబాక్కంలోని ఓ హోటల్‌లో గదిఅద్దెకు తీసుకుని బసచేశారు. మణి మద్యంమత్తులోకి జారుకోగా,దీపలక్ష్మి అతడి దగ్గరున్న పదిసవర్ల బంగారు నగలతో ఉడాయించింది. మత్తు దిగిన తర్వాత తాను ధరించిన నగలు కనిపించకపోవడంతో షాక్‌కు గురైన ఆన దీపలక్ష్మికి ఫోన్ చేయగా స్విచాఫ్ అని వచ్చింది. దీంతో మోసపోయినట్టు గ్రహించి తేనాంపేట పోలీసులకు మణి ఫిర్యాదుచేశారు.కేసు నమోదు చేసిన పోలీసులు మొబైల్ నంబరు ఆధారంగా ఆమెను గుర్తించి అరెస్టు చేసి విచారించగా ఆసక్తికర విషయాలను వెల్లడించింది. చోరీ చేసిన నగలను రూ.7 లక్షలకు కుదువపెట్టి, తన ప్రియుడు సతీష్‌కు ఖరీదైన బైకు కొనిచ్చినట్టు తెలిపింది. ఆ తర్వాత అద్దెకారులో చెన్నై నుంచి సేలం జిల్లా ఏర్కాడు వెళ్లారు. అక్కడ నుంచి చెన్నై తిరిగి రాగా, పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. ఆమె నుంచి రూ.3.50 లక్షలతో పాటు ప్రియుడికి కొనిచ్చినఖరీదైన బైకు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత వీరిద్దరినీ కోర్టులో హాజరుపరిచి పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు.

మళ్ళీ విరుచుకుపడిన శ్రీలంక నావికాదళం

14 మంది రామేశ్వరం జాలర్ల అరెస్టు

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కచ్చాదీవి సమీపంలో బుధవారం వేకువజాము చేపలు పడుతున్న రామేశ్వరం జాలర్లపై శ్రీలంక నావికదళం దాడి చేసింది. మొదట పదిమంది జాలర్లను, ఆ తర్వాత నలుగురు జాలర్లను అరెస్టు చేసింది. రామేశ్వరం సమీపం పాంబన్ చేపల రేవు నుంచి మంగళవారం ఉదయం వందకు పైగా మరపడవలలో జాలర్లు సముద్రంలో చేపలవేటకు వెళ్ళారు. బుధవారం వేకువజాము కచ్చాదీవి సమీపంలో పదిమంది జాలర్లున్న మరపడవ దెబ్బతింది. ఆ పడవకు జాలర్లు మరమ్మతు చేస్తుండగా గస్తీ నౌకలో వచ్చిన శ్రీలంక నావికాదళం తమ దేశ సరిహద్దుల్లో ప్రవేశించారంటూ పదిమంది జాలర్లను నిర్బంధించి కాంగేశన్ నావికాదళం శిబిరానికి తీసుకెళ్లింది. ఇదే విధంగా తొండి ప్రాంతం నుండి చేపలవేటకు వెళ్ళి నలుగురు జాలర్లను కూడా శ్రీలంక నావికాదళం అరెస్టు చేసింది. ఈ విషయం తెలిసిన పాంబన్ జాలర్ల సంఘం నాయకులు తీవ్ర ఆందోళన చెందారు. మత్స్యశాఖ ఉన్నతాధికారులను కలిసి శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిన 14 మంది జాలర్లను విడిపించేందుకు చర్యలు చేపట్టమంటూ విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రాంతాల వివరాలిలా వున్నాయి... **ప్యారీస్:** రామానుజం వీధి, వినాయక మొదలి వీధి, నంబి నాయకన్ వీధి, మునియప్ప వీధి, కొత్వాల్ చావడి, ఎర్రబాలు వీధి, మన్నాడి, వాల్‌ట్యాక్స్ రోడ్డు, ఉడ్‌వాక్ రోడ్, అమ్మన్ కోయిల్ వీధి, టెలిగ్రాఫ్ అబ్బాయి వీధి, నార్త్ వాల్ రోడ్, అన్నాపిళ్లైవీధి, పల్లియప్పన్ వీధి, ముల్లా సాహెబ్ వీధి, పెరుమాళ్ మొదలివీధి, నారాయణ మొదలి వీధి, ముత్తయ్య వీధి, గోడౌన్ వీధి, గోవిందప్పనాయకన్ వీధి, మింట్ వీధి, తులసింగం వీధి, పెరియనాయకన్ వీధి, చిన్న నాయకన్ వీధి, నేతాజీ సుభాష్ చంద్రబోస్ వీధి, జనరల్ ముత్తయ్య వీధి, టీవీ బేసిన్ వీధి, అరుణాచల వీధి, తిరుపల్లి వీధి, కేఎన్ అగ్రహారం, లాయర్ చిన్నతంబి వీధి, కేఎన్ దొడ్డివీధి, పెద్దనాయకన్ వీధి, అయ్యన్ మంగా వీధి, వీరప్పన్ వీధి, కల్యాణపురం హౌసింగ్‌బోర్డు, జట్కాపురం, కందప్పవీధి, మురుగప్పవీధి, ఏలకాంతప్పవీధి, కొండప్పన్ వీధి, వెంకట్రామన్ వీధి, రమణన్ సాలై, ఆదియప్పవీధి, వైకుంఠ వైద్యర్ వీధి, కళాత్తిపిళ్లై వీధి, ఇరులప్పవీధి, ఎలిఫెంట్‌గేట్, చంద్రప్రభ వీధి, అయ్యా మొదలివీధి, గోడౌన్ వీధి, కన్నయ్యనాయుడు వీధి, కొండితోపు పోలీస్ క్వార్టర్స్, కొడవట్టమ్మన్‌వీధి.

తండయార్‌పేట: గుమ్మాళమ్మన్ ఆలయ వీధి, తండయార్‌పేట హైరోడ్డు, జీఏ రోడ్డు, షోళయప్పన్ వీధి, కప్పల్ బోల్ వీధి, వీపీ కోయిల్ వీధి, తాండవరాయన్ వీధి, రెయినీ ఆసుపత్రి, శ్రీరంగమ్మాళ్ వీధి, రామానుజం వీధి, సంజీవ రాయన్ వీధి, సుబ్బరాయన్ వీధి, బాలు మొదలి వీధి, పాతచాకలి పేట, ఇళయార్ వీధి, మన్నప్ప వీధి, తంగవేల్ వీధి, నైనియప్పన్ వీధి, పెరుమాళ్ కోయిల్ వీధి, వీరకొట్టు వీధి, మేయర్ బాసుదేవ్ వీధి. **నీలాంగరై:** కెనాల్ మెయిన్‌రోడ్, పాతగణేశ నగర్ 1నుంచి 7 వీధులు, మహాత్మాగాంధీ నగర్ 1నుంచి12 వీధులు, కామరాజర్ నగర్ గోపీనాథ్ అవెన్యూ 1 నుంచి 3 వీధులు, అన్నావీధి, ఎంజీఆర్ నగర్, భారతి వీధి, రామలింగ నగర్, కర్పగ వినాయగర్ 7వ ప్రధాన వీధి, నారాయణ నగర్, వివేకానందవీధి, సెందామరై వీధి

అడయార్: కస్తూర్బా నగర్, కర్పగ వినాయగ నగర్, క్లాసిక్ ఎన్‌క్లేవ్, రాయల్ ఎన్‌క్లేవ్, రాజన్ నగర్, శరవణ ననగర్, ప్రార్థనా అవెన్యూ, చేరన్ నగర్ లోని 1, 2 అవెన్యూలు, వెట్టువాన్‌కేని, బృందావన్ నగర్.

గిండి ఎక్స్‌టెన్షన్: మడిపాక్కం, శీలా నగర్, మదర్‌థెరిస్సా నగర్, సదాశివం నగర్, గోవిందస్వామి నగర్, రాజాజా నగర్, రామ్‌నగర్ సౌత్, కుబేరన్ నగర్, అంబికా నగర్, ఎల్‌ఐసీ నగర్, లక్ష్మీ నగర్, రాజేశ్వరి నగర్, భజన కోయిల్ వీధి, పెరియార్ నగర్, కులక్కరై వీధి, ఎన్‌ఫీల్డ్ అవెన్యూ, శ్రీనగర్, మూవరసన్‌పేట, మేడవాక్కం మెయిన్‌రోడ్, అయ్యప్ప నగర్, గణేశనగర్, అలమేలు మంగాపురం, గాంధీనగర్, వెంకటేశ్వర నగర్, జయలక్ష్మి నగర్, పొన్నియమ్మాళ్ కోయిల్ వీధి, రాఘవ నగర్, విశాల్ నగర్, అరుళ్‌మురుగన్ నగర్, అన్నానగర్, రామ్మూర్తి నగర్, కార్తికేయపురం, శబరివీధి, దైవానై నగర్, మదురై కాళి నగర్, మడిపాక్కం మెయిన్‌రోడ్డు, పుళిదివాక్కం మెయిన్‌రోడ్, వెంకట్రామన్ వీధి, భారత్ వీధి, రాజీ వీధి, ఆండవర్ వీధి, ఓట్టేరి రోడ్, ఈవీఆర్ కాలనీ, రాఘవన్ నగర్, చర్చి వీధి, కళైమగన్ వీధి, మురుగప్ప నగర్, శ్రీధరన్ వీధి, అమ్మన్ నగర్, చెంగాళియమ్మన్ నగర్ వీధి, హిందూ కాలనీ, గణేశనగర్, ఎన్ఎస్‌సీ బోస్ రోడ్, తిలగర్ అవెన్యూ

ఐటీ కారిడార్: ఎళిల్ నగర్, కన్నగి నగర్, ఇంజంబాక్కం, వీజీపీ గోల్డెన్ బీచ్, రాయల్ అవెన్యూ, కుమరన్ కాలనీ, దేవరాజ్ అవెన్యూ, మౌంట్‌బాటన్ వీధి, పిల్లయార్ కోయిల్ వీధి, ఎస్‌జీకే అవెన్యూ, సెక్రటేరియట్ కాలనీ, పార్థసారథి నగర్, అన్నై పార్వతి నగర్, పూంపుహార్ నగర్.

ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో 17 మందిపై గుండా చట్టం రద్దు

ప్యారీస్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్‌వాదీ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించిన ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో అరెస్టయిన వారిలో 17 మందిపై ప్రయోగించిన గూండా చట్టాన్ని మద్రాస్ హైకోర్టు బుధవారం రద్దు చేసింది. గత ఏడాది జూలై 5న పెరంబూరు సమీపంలోని అగరం ప్రాంతంలో ఆమ్‌స్ట్రాంగ్‌ను ఆయన ఇంటివద్దే హత్య చేసిన కేసులో పోలీసులు 27 మందిని అరెస్టు చేశారు. వీరిలో 26 మందిపై గూండా చట్టం ప్రయోగించారు. గూండా చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ రౌడీషీటర్ నాగేంద్రన్ సహా 17 మంది మద్రాస్ హైకోర్టులో పిటిషన్లు వేశారు. న్యాయమూర్తులు ఎంఎస్ రమేష్, వి.లక్ష్మీనారాయణన్‌లతో కూడిన ధర్మాసనం ముందు ఆ పిటిషన్లపై బుధవారం విచారణకు వచ్చింది. ఇరు తరుపు న్యాయవాదుల వాదనలు విన్న అనంతరం ఈ కేసుపై తీర్పు వెలువరించిన హైకోర్టు ధర్మాసనం 17 మందిపై ప్రయోగించిన గూండా చట్టాన్ని రద్దుచేసింది.. అదే సమయంలో గూండా చట్టాన్ని రద్దుచేసినంత మాత్రాన వారికి బెయిల్ మంజూరు చేయరాదని, కేసు తీవ్రతను బట్టి బెయిల్ పిటిషన్లను విచారణకు స్వీకరించే నిర్ణయాన్ని త్వరలో వెల్లడిస్తామని న్యాయమూర్తుల బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది.

ఎస్‌ఐ గదిలో ఫ్యానుకు ఉరేసుకున్న కార్మికుడు

● ఇద్దరు పోలీసుల బదిలీ

అడయార్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులోని కడై వీధిలోని శాంతి భద్రతల పరిరక్షణ విభాగం స్టేషన్‌లోని ఎస్ఐ గదిలో ఓ కార్మికుడు ఉరేసుకున్నాడు. మృతుడుని కోవై పోరూర్ సమీపంలోని సామిశెట్టి పాళయంకు చెందిన రాజన్ (60)గా గుర్తించారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఈయన.. తనపై కొందరు దాడి చేశారంటూ ఫిర్యాదు చేశాడు. అయితే, అతడి మానసిక పరిస్థితి గమనించిన పోలీసులు ఫిర్యాదు తీసుకోకుండా, అక్కడ నుంచి పంపించి వేశారు. కానీ, ఆ వ్యక్తి పోలీస్ స్టేషన్ మొదటి అంతస్తులో ఉన్న క్రైమ్ విభాగం ఎస్ఐ గదికి వెళ్ళి ఫ్యానుకు ఉరేసుకున్నాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఇదిలా ఉండగా పోలీస్ స్టేషన్‌లో ఖైదీ ఆత్మహత్య చేసుకున్న వ్యవహారంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఎస్ఐ నాగర్, హెచ్‌సీ సెంథిల్ కుమార్‌లను సాయుధ విభాగానికి బదిలీ చేశారు. మరోవైపు, ఘటనా స్థలాన్ని కోవై పోలీస్ కమిషనర్ శరవణసుందర్, జాయింట్ కమిషనర్ కార్తికేయన్ పరిశీలించారు.

ఆటో బోల్తా : బాలుడి మృతి



ప్రమాదానికి గురైన ఆటో, ఇన్‌సెట్‌లో రోహిత్

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విరుదాచలం వద్ద బుధవారం ఉదయం ఆటో బోల్తాపడటంతో నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. విరుదాచలం సమీపం కుప్పనత్తం ప్రాంతంలో మురుగవేల్ అనే ఆటో డ్రైవర్‌కు ఇద్దరు కుమారులు, రెండో కుమారుడు రోహిత్ (4) ఓ ప్రైవేటు స్కూలులో యూకేజీ చదువుతున్నారు. మురుగవేల్ రోజూ తన ఆటోలో రోహిత్‌ను స్కూలుకు తీసుకెళుతున్నారు. బుధవారం ఉదయం రోహిత్‌ను ఆటోలో ఎక్కించుకుని వెళ్తుండగా దారిలోని ఓ గోతిలో ఆటో దిగి అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న రోహిత్ తీవ్రంగా గాయపడి ఆ స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. విరుదాచలం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం

అడయార్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన గూడువాంజేరి సమీపంలోని పెరుమాట్టునల్లూరులో కన్నతండ్రిని కుమారుడు గొంతునులిమి హత్య చేశారు. తన తండ్రి పరాయి స్త్రీతో అక్రమ సంబంధం పెట్టుకోవడాన్ని జీర్ణించుకోలేక ఈ దారుణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు... అయ్యన్‌కోయిల్ వీధికి చెందిన గుబేంద్రన్ (58)కు భార్య, ముగ్గురు కుమారులున్నారు. పెద్ద కుమారుడు ధనుష్ (22) ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. అయితే, గుబేంద్రన్‌కు అదే ప్రాంతానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం ఉంది. అది మానుకోవాలని భార్యాపిల్లలు ఎంత చెప్పినా గుబేంద్రన్ వినలేదు. ఆ విషయంలో తండ్రీకుమారుల మధ్య గొడవ జరిగింది. దీంతో ధనుష్ కోపంగా తండ్రిని గొంతునులిమి చంపేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

రన్‌వేపై విమానంలో సాంకేతిక లోపం

అడయార్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి తిరుచ్చికి బయలుదేరిన విమానం రన్‌వేపైకి వెళ్ళిన తర్వాత ఇంజిన్‌లో సాంకేతికలోపం తలెత్తింది. దీన్ని గుర్తించిన పైలెట్లు విమానాన్ని నిలిపివేయడంతో అందులోని 73 మంది ప్రయాణికులకు ప్రాణాపాయం తప్పింది. బుధవారం ఉదయం 5.45 గంటలకు తిరుచ్చి వెళ్ళే విమానం టేకాఫ్ అయ్యేందుకు రన్‌వే మీదకు రాగా, విమానంలో సాంకేతిక లోపం ఉన్నట్టు పైలెట్లు గుర్తించి విమానాన్ని నిలిపివేశారు. ఆ విమానంలో 68మంది ప్రయాణికులు,ఐదుగురు విమానసిబ్బంది ఉన్నారు.

తాళమేసి ఉన్న ఇంట్లో 12 సవర్ల నగల చోరీ

తిరుత్తణి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని ఇలుపూరు గ్రామంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో 12 సవర్ల నగలు చోరీచేసిన అగంతకుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఆ గ్రామంలో వేణుగోపాల్, శాంతి అనే భార్యాభర్తలు ప్రభుత్వం ఇచ్చిన ఇంటిలో నివాసం ఉంటూ అదే గ్రామంలో పెట్టెల దుకాణం నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఆంధ్రప్రదేశ్‌లోని నగరిలో అమ్మవారి ఆలయానికి కుటుంబ సభ్యులంతా వెళ్ళారు. సాయంత్రం ఇంటికి తిరిగివచ్చిన వారు ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని చూసి వెళ్ళి చూడగా, బీరువాలోని 12 సవర్ల నగలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. వారు ఫిర్యాదు తీసుకోకపోవడంతో వేణుగోపాల్ భార్య శాంతి మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన గృహాల్లో తమకు రక్షణ లేదని, వాపోయింది. దీనిపై బుధవారం ఉదయం జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్ళి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశామన్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

విద్యార్థులకు రూ.5లక్షల సహాయాల పంపిణీ



విద్యార్థులతో లయన్స్ క్లబ్ నిర్వాహకులు జీఆర్ వెంకటేష్, కాశీనాథన్

ప్యారీస్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో రాయపురం సీఎస్ఐ పాఠశాల ప్రాంగణంలో చిన్నారులకు రూ.5 లక్షల విలువైన సంక్షేమ పథకాలను పంపిణీ చేశారు. జీకేఎం లయన్స్ క్లబ్ ఛైర్మెన్ ,టీఎంసీ ప్రధాన కార్యదర్శి జీఆర్ వెంకటేష్, క్లబ్ నిర్వాహకులు కాశీనాథన్, మరియమ్మ, గవర్నర్ మురుగన్, మాజీ గవర్నర్ మురుగేష్‌కుమార్, మోహనసుందరం, రవి తదితరులు పాల్గొన్నారు. సుమారు 200 మంది పైగా విద్యార్థిని, విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, విద్యా ఉపకరణాలతో పాటు అల్పాహారం కూడా బుధవారం జరిగిన కార్యక్రమంలో పంపిణీ చేశారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో రేషన్‌దుకాణం



రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్

తిరుత్తణి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరులో యూనియన్ పరిధిలోని పుదుమావిలంగై గ్రామంలో తిరువళ్లూరు ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్ సొంత నిధులతో నిర్మించిన రేషన్ దుకాణాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీజీ రాజేంద్రన్ మాట్లాడుతూ, తమ గ్రామంలో రేషన్ దుకాణం శిథిలావస్థకు చేరుకుందని ప్రజలు రేషన్ సరుకులు తీసుకెళ్ళేందుకు ఇబ్బంది పడుతున్నారని చెప్పడంతో సొంత ఖర్చులతో ఈ రేషన్ దుకాణ భవనాన్ని నిర్మించినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని నేతలు అండగా ఉంటారని, ప్రజలంతా డీఎంకేకు మద్దతుగా ఉండాలన్నారు. అనంతరం పుదుమావిలంగై గ్రామంలో 'ఉంగళుడన్ స్టాలిన్' కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజల సమస్యలపై వినతిపత్రాలను ఆయన స్వీకరించారు.

వినోద్ హీరోగా 'పేయ్ కథై'



'పేయ్ కథై' ఆడియో రిలీజ్

చిత్రజ్యోతి

● ఆడియో రిలీజ్

వినోద్ అనే వర్ధమాన నటుడు హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'పేయ్ కథై'. జెర్సీస్ జర్నీ ఇంటర్నేషన్ ప్రొడక్షన్స్ హౌస్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రానికి జాన్ మోసెస్ దర్శకుడు. ఈ చిత్ర ఆడియో, ట్రైలర్ రిలీజ్ వేడుక నగరంలో తాజాగా జరిగింది. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకులు సబేష్, మురళి ముఖ్య అతిథులుగా హాజరై ఆడియో రిలీజ్ చేశారు. ఈ నెల 29న విడుదలకానున్న ఈ చిత్రంలో వినోద్ సరసన ఆర్యలక్ష్మి జంటగా నటించగా, ఇతర పాత్రల్లో కనా పల్లవ్, సుకన్య, ఆష్ మెలో, సెల్వ, ఎలిజబెత్, సూరజ్, జీవీ మహా, షైబేల్, శ్రీమంత్, రేట్స్, జీవిత తదితరులు నటించారు. తేనాండాల్ ఫిలిమ్స్ సురేష్ సమర్పించగా, జెర్సీ నిర్మించిన ఈ చిత్ర ఆడియో రిలీజ్ వేడుకలో దర్శకుడు జాన్ మోసెస్ మాట్లాడుతూ, 'ఈ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం కల్పించిన నిర్మాతలకు ధన్యవాదాలు. ఇది దెయ్యం కథ అయినప్పటికీ కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించాం. చిన్నారులు కూడా థియేటర్‌కు వచ్చి ఈ సినిమా చూసే విధంగా ఉంటుందన్నారు. హీరో వినోద్ మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు, నేను సంగీత దర్శకులు సబేష్ - మురళి వీరాభిమానిని. ఎందుకంటే, 'వాలి' చిత్రానికి వారు సంగీతం అందించారు. వారిద్దరూ ఇపుడు ఆడియో రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథులుగా రావడం చాలా సంతోషంగా ఉంది. 22 యేళ్ళుగా ఒక కార్పొరేట్ కంపెనీలో పనిచేస్తున్నాను. అక్కడ తెలియని, నేర్చుకోలేని అనేక విషయాలు సినిమాల్లో అడుగుపెట్టిన తర్వాత తెలుసుకున్నాను. ఈ నెల 29వ తేదీన చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు.

మృణాల్ ప్రేమలో కోలీవుడ్ స్టార్ హీరో?


మృణాల్ ఠాకూర్

ప్రముఖ నటి మృణాల్ ఠాకూర్‌తో కోలీవుడ్ హీరో ఒకరు పీకల్లోతు ప్రేమలో మునిగితేలుతున్నట్టు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం సాగుతోంది. ఇది ఇపుడు కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. నిజానికి మృణాల్ ఠాకూర్ ఒక్క డైరెక్ట్ తమిళ చిత్రంలోనూ నటించలేదు. కానీ, ఇతర భాషల్లో ఆమె నటించిన పలు చిత్రాలను తమిళంలోకి అనువాదం చేసి రిలీజ్ చేశారు. వీటిలో 'సీతారామమ్', 'హాయ్ నాన్నా' వంటి హిట్ చిత్రాలున్నాయి. ఇదిలావుంటే, ఈ నెల ఒకటో తేదీన మృణాల్ ఠాకూర్ తన పుట్టిన రోజు వేడుకలను ముంబైలో ఎంతో గ్రాండ్‌గా సెలెబ్రేట్ చేసుకున్నారు. ఇందులో పలు చిత్రపరిశ్రమలకు చెందిన సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఓ కోలీవుడ్ హీరో బర్త్‌డే ఏర్పాట్లు చేయడంతో పాటు ఆ పార్టీలో పాల్గొన్నారు. పైగా మృణాల్‌తో ఎంతో సన్నిహితంగా ఉంటూ, ఆమె చేయిపట్టుకుని మాట్లాడుతున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. దీంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ ప్రచారం సాగుతోంది. ఈ కోలీవుడ్ హీరో ఇద్దరు పిల్లలకు తండ్రి. పైగా తన భార్య నుంచి విడాకులు తీసుకుని ఉండటంతో మృణాల్‌తో ప్రేమలో ఉన్నట్టు సమాచారం.

ఎం.ఎన్.రాజమ్ 90వ జన్మదిన వేడుకలు


కుటుంబ సభ్యులతో కలిసి రాజమ్ బర్త్‌డే వేడుకలు

అలనాటి నటి ఎం.ఎన్. రాజమ్ తన 90 జన్మదిన వేడుకలను మంగళవారం అడయారు, కామరాజర్ అవెన్యూలో ఉన్న నివాసంలో కుటుంబ సభ్యుల సమక్షంలో జరుపుకున్నారు. 1950 నుంచి 1960 వరకు తమిళ చిత్ర పరిశ్రమలోని అగ్రహీరోయిన్లలో ఒకరిగా వెలుగొందిన ఎం.ఎన్.రాజమ్... 'రత్తకన్నీర్', 'పెన్నిన్ పెరుమై', 'పుదైయల్', 'నాడోడి మన్నన్', 'పాసమలర్', 'తాలి భాగ్యం', 'అలీబాబావుమ్ 40 తిరుడర్‌గలుమ్', 'అరంగేట్రం' వంటి అనేక హిట్ చిత్రాల్లో ముఖ్య పాత్రలు పోషించారు. ఆమె సినీ కెరీర్‌లో దాదాపు 200కుపైగా చిత్రాల్లో నటించారు. ఈ నేపథ్యంలో ఆమె మంగళవారం తన 90వ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఇందులో ఆమె కుమార్తె, కుమారుడు, మనవడు, మనవరాలు, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఆమె ఆమె అనారోగ్యంపాలై విషమంగా ఉన్నారంటూ బుధవారం ప్రచారం సాగింది. ఈ వార్తలను ఆమె కుమారుడు ఖండించారు.

'కింగ్డమ్' ప్రదర్శించే థియేటర్లకు భద్రత కల్పించండి



'కింగ్డమ్'లో ఓ దృశ్యం

● హైకోర్టులో పిటిషన్

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ - భాగ్యశ్రీ బోర్సే కాంబినేషన్‌లో గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో వచ్చిన 'కింగ్డమ్' చిత్రం ప్రదర్శించే థియేటర్లకు భద్రత కల్పించాలని డిస్ట్రిబ్యూషన్ కంపెనీ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేసింది. ఈ చిత్రంలో అనేక సన్నివేశాలు శ్రీలంక ఈలం తమిళుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయంటూ నామ్ తమిళర్ కట్చి కార్యకర్తలు ఈ చిత్రం ప్రదర్శించే థియేటర్ల వద్ద ఆందోళన చేస్తున్నారు. అలాగే, ఈ చిత్ర ప్రదర్శన నిలిపివేయాలని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో కూడా డిమాండ్ చేశారు. దీంతో రామనాథపురం ప్రాంతాల్లో ఈ సినిమా ప్రదర్శించే థియేటర్ల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాను తమిళంలో పంపిణీ చేసిన ఎస్ఎస్ఐ ప్రొడక్షన్స్ బుధవారం మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి, 'కింగ్డమ్' చిత్రం ప్రదర్శించే థియేటర్లకు పోలీస్ భద్రత కల్పించాలని కోరింది. ఈ పిటిషన్ న్యాయమూర్తి టి.భరత్ చక్రవర్తి ముందు విచారణకు రాగా, పోలీస్‌లు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. సెన్సార్ పూర్తయి విడుదలైన చిత్ర ప్రదర్శన అడ్డుకునే హక్కు లేదనీ, చిత్రంలోని సన్నివేశాలు మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉంటే ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనలు తెలుపుతూ, ఆ చిత్రానికి వ్యతిరేకంగా ప్రచారం చేసుకోవచ్చని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు.

ఆఖరి మజిలీకి ఆధునిక సొబగులు

● పార్కును మరిపించేలా అన్నానగర్ శ్మశానవాటిక

ప్యారీస్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గతంలో శ్మశాన వాటిక ఊరి చివరన, నదీ తీరాల్లో ఎక్కడో ఉండేది. కానీ చెన్నై నగరంలోని అన్నా నగర్ శ్మశాన వాటికను ఆఖరి మజిలీ ప్రాంతం కూడా అందంగా ఉండాలని భావించిన జీసీసీ పచ్చదనంతో రూపొందించి. శ్మశానవాటిక అనగానే మృతదేహాలకు అంత్యక్రియలు జరిగే ప్రాంతంగా భావిస్తూ ఆ ఛాయలకు వెళ్ళడానికి కూడా చాలామంది జంకుతుంటారు. అయితే తమవారి అంత్యక్రియల కోసం వచ్చేవారికి మనసు ప్రశాంతంగా ఉండేలా అన్నానగర్ జోన్ పరిధిలోని వేలంకాడు శ్మశానవాటిక పార్కును తలదన్నేలా జీసీసీ రూపొందింది. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఆధ్వర్యంలో రూపొందిన శ్మశానవాటిక ఎన్నో ప్రత్యేకతలున్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో శ్మశాన వాటిక ప్రవేశద్వారం, గులాబీ గార్డెన్, పార్కు తదితరాలను సింగార చెన్నై 2.0 పథకం కింద ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారు. రుద్రభూమిలో తిరిగే శివయ్య విగ్రహాన్ని వాటర్‌ఫౌంటెన్ మధ్య పొందుపరిచారు. దీనిని చూసి జీసీసీ చర్యలను పలువురు ప్రశంసిస్తున్నారు.



గులాబీ గార్డెన్
శ్మశాన వాటిక బోర్డు ముందు గ్రీనరీ
పెంపుడు జంతువులను ఖననం చేసే ప్రాంతం
వాటర్ ఫౌంటెన్‌లో పరమేశ్వరుడి విగ్రహం
ఆకట్టుకుంటున్న శ్మశాన వాటిక ప్రవేశద్వారం

డీఎంకేలోకి అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే

● కార్తీక్ తొండైమాన్‌కు కండువా వేసి స్వాగతించిన స్టాలిన్

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే మాజీ శాసనసభ్యుడు కార్తీక్ తొండైమాన్ డీఎంకేలో చేరారు. 2012లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో పుదుకోట నియోజకవర్గంలో కార్తీక్ తొండైమాన్ అన్నాడీఎంకే తరపున పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత 2016, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ నియోజకవర్గంలోనే పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం తేనాంపేటలోని అన్నా అరివాలయంలో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి పార్టీ సభ్యత్వం స్వీకరించారు. పార్టీలో చేరిన కార్తీక్ తొండైమాన్‌కు స్టాలిన్ సత్కరించి, పార్టీ సభ్యత్వ కార్డు అందజేశారు. అనంతరం అరివాలయం వెలుపల కార్తీక్ తొండైమాన్ మీడియాతో మాట్లాడుతూ అన్నాడీఎంకే మతతత్వ పార్టీతో చేతులు కలుపడాన్ని పార్టీ శ్రేణులు సహించడం లేదని, ఆ కారణంగానే తాను కూడా పార్టీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వచ్చానని, ప్రస్తుతం అన్నాడీఎంకే నాయకుడు ఎడప్పాడి పళనిస్వామి బీజేపీకి పూర్తిగా వత్తాసుపలుకుతుండటం గర్హనీయమన్నారు. మతతత్వ శక్తులకు రాష్ట్రంలో తావులేదని, సెక్యులర్ భావాలు కలిగిన డీఎంకేలో చేరటం సముచితమని భావించే తానీ రోజు ఆ పార్టీలో సభ్యత్వం పొందానని ఆయన చెప్పారు.


అరివాలయంలో డీఎంకే సభ్యత్వం స్వీకరించి ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్‌ను సత్కరించిన కార్తీక్ తొండైమాన్

ఆరువేల మంది చిన్నారులకు హృద్రోగ చికిత్స

● అపోలో చిల్డ్రన్స్ హాస్పిటల్ రికార్డు

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అపోలో చిల్డ్రన్స్ హాస్పిటల్ గత 17 యేళ్లలో 6వేల మంది చిన్నారులకు హృద్రోగ చికిత్స చేసి సరికొత్త రికార్డు సృష్టించిందని ఆస్పత్రి వైద్యనిపుణులు డాక్టర్ నివేలి సాల్మన్, డాక్టర్ సీఎస్ ముత్తుకుమరన్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం నగరంలో ఏర్పాటైన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ బరువుతక్కువ పిల్లల నుంచి నాలుగేళ్ల చిన్నారుల వరకు శస్త్రచికిత్సలు జరిపామని, ఈ రికార్డు సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరించిందని, సీఎం వైద్య బీమా పథకం ద్వారా మధ్యతరగతి కుటుంబాల తల్లులు తమ చిన్నారులను సకాలంలో చేర్పి కాపాడుకోగలిగారని చెప్పారు. ఇదే విధంగా నిరుపేద కుటుంబాల చిన్నారులకు ఈ శస్త్రచికిత్సలు చేసేందుకు ఆర్థికసాయం అందజేసి ఆదుకున్నాయని, అపోలో ఆస్పత్రి నిర్వాహకులు కూడా సేవా భావంతో భారీగా నిధులను కేటయించిందని చెప్పారు. ఇదే విధంగా పదివేల మంది చిన్నారులకు గుండె, శ్వాసకోశ సంబంధిత చికిత్స అందించి ప్రాణాలను కాపాడినట్లు తెలిపారు. ఈ శస్త్రచికిత్సల్లో టాంజానియాకు చెందిన ఒకే దేహంతో జన్మించిన కవలలను వేరు చేసిన శస్త్రచికిత్స కూడా ఉందన్నారు. ఈ సమావేశంలో అపోలో హాస్పిటల్స్ చెన్నై రీజిన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ ఇలంకుమరన్ కళియమూర్తి, డాక్టర్ వేల్‌మురుగన్, డాక్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



హృద్రోగ చికిత్స జరిగిన పసికందులు, వారి తల్లులతో ఆస్పత్రి వైద్యనిపుణులు


క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకున్న డీపీఐ నేత తిరుమావలవన్, సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి పి.షణ్ముగం, సీపీఐ సభ్యుడు సంతానం తదితరులు

స్టాలిన్‌తో డీఎంకే మిత్రపక్షాల నేతల భేటి

● పరువుహత్యల నిరోధక చట్టం కోసం డిమాండ్

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెరుగుతున్న పరువు హత్యలను నిరోధించే దిశగా ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు మిత్రపక్షాల నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఉదయం చెన్నై క్యాంపు కార్యాలయంలో డీపీఐ నేత తిరుమావళవన్, సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి పి. షణ్ముగం తదితరులు స్టాలిన్‌ను కలుసుకున్నారు. ఈ నాయకులంతా ముందుగా స్టాలిన్ ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. ఆ తర్వాత రాష్ట్రంలో పరువు హత్యలను నిరోధించడానికి ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహాలు గురించి సమగ్రంగా చర్చలు జరిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం ఉదయనిధి, మంత్రులు ఈవీ వేలు, కేఎన్ నెహ్రూ, దామో అన్బరసన్, డీపీఐ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వన్నియరసు తదితరులు పాల్గొన్నారు.

చెన్నైలో 'ఇండియా టర్న్స్ పింక్' కార్యాలయం

అడయార్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని అన్ని వర్గాల్లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో స్థాపించబడిన 'ఇండియా టర్న్స్ పింక్' చెన్నైలో నూతన కార్యాలయం ఏర్పాటు చేసింది. కోయంబేడులోని అరిహంట్ మెజిస్టిక్ టవర్స్‌లో ఏర్పాటైన ఈ కార్యాలయాన్ని ఇటీవల నవీన్స్ డైరెక్టర్ క్షీర్ వసుధ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ- తాను చాలా ఏళ్లుగా పింక్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నానని, ఇప్పుడు చెన్నైలో ఈ ప్రాంగణాన్ని ప్రారంభించడం సంతోషంగా వుందన్నారు. రొమ్ము క్యాన్సర్‌పై వీలైనంత ఎక్కువమందికి అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా ఆమె ఆకాంక్షించారు. సంస్థ వ్యవస్థాపకుడు వీపీ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ- ప్రతి మహిళ ఆరోగ్యం, బలం, భవిష్యత్తుకు అంకితమైన కేంద్రంగా ఈ కొత్త కార్యాలయం వుండాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.


కార్యాలయ ప్రారంభోత్సవ దృశ్యం



రక్షా బంధన్ సందర్భంగా పోలీసు అధికారులకు రాఖీ కడుతున్న కొరట్టూరు భక్తవత్సలం మెమోరియల్ మహిళా కళాశాల విద్యార్థినులు

రేలా హాస్పిటల్ ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్‌లో వాకథాన్



జెండా ఊపి వాకథాన్‌ను ప్రారంభిస్తున్న రెడ్‌హిల్స్ సీఐ విజయకుమార్

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రెడ్‌హిల్స్‌లోని రేలా హాస్పిటల్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం వాకథాన్ నిర్వహించారు. హస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎస్.రాజగోపాలన్ సమక్షంలో ఈ వాకథాన్‌ను రెడ్‌హిల్స్ సీఐ ఎస్. విజయకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. రెడ్‌హిల్స్ పోలీసుస్టేషన్ నుండి రేలా హాస్పిటల్ వరకు ఐదు కిలోమీటర్ల మేర నిర్వహించిన ఈ వాకథాన్‌లో విద్యార్థులు, మహిళలు, హాస్పిటల్ డాక్టర్లు, నర్సులు, ఉద్యోగులు సహా సుమారు 500 మంది పాల్గొన్నారు.

షాపర్స్ స్టాప్ వినియోగదారులకు అరుదైన అవకాశం

అడయార్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెట్‌పేట్‌లోని షాపర్స్ స్టాప్ వినియోగదారునికి అరుదైన అవకాశం లభించింది. 'ట్రావెల్ ఎడిట్' ప్రచారంలో భాగంగా చెన్నైకి చెందిన ఫరీదా బాను అనే వినియోగదారులు పుకెట్‌కు వెళ్లే అవకాశాన్ని చేజిక్కించుకున్నారు. ఆ మేరకు టిక్కెట్‌ను ఆమె కుటుంబీకులకు అందించారు. ఈ సందర్భంగా షాపర్స్ స్టాప్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ జితేన్ మహేంద్ర మాట్లాడుతూ-తమ ట్రావెల్ ఎడిటర్ ప్రచారం ద్వారా పలు చిరస్మరణీయమైన అనుభవాలను సృష్టించడం ద్వారా తమ కృతజ్ఞత తెలియచేస్తున్నామన్నారు.







ఆలయం ముందు కుమారుడు రిత్విక్‌తో రమ్యకృష్ణ - ప్రేమ్ సింగ్ తమంగ్


ప్రముఖ సినీనటి రమ్యకృష్ణ కుమారుడు రిత్విక్ వంశీతో కలిసి బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.అలాగే సిక్కిం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమంగ్, కర్ణాటక హోంమంత్రి గంగాధరయ్య పరమేశ్వర, సినీనటి సత్యశ్రీ కూడా బుధవారం శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నేడు తలకోనలో వన్యప్రాణి,అటవీ సంరక్షణపై సమావేశం

ఎర్రావారిపాల్యెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తలకోనలో వన్యప్రాణి, అటవీ సంరక్షణపై గురువారం జిల్లా స్థాయి సమావేశం జరగనుంది. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పోలీస్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులు పాల్గొంటారు. అటవీ, వన్యప్రాణులు సంరక్షణకు సంబంధించి క్షేత్ర స్థాయిలో తీసుకుంటున్న చర్యలపై చర్చించనున్నారు. శేషాచలంలోని తలకోన జీవవైవిధ్య ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఈ అభయారణ్యంలో వన్యప్రాణుల వేటను అధికారులు పూర్తిస్థాయిలో అరికట్టలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. వివిధ సందర్భాల్లో 49 ఏనుగులు ఇప్పటివరకూ మృత్యువాత పడ్డాయి. విద్యుత్ తీగలు తగలడం, అనారోగ్యం, ప్రమాదకర బావుల్లో పడడం లాంటి కారణాలతో ఇవి చనిపోతున్నాయి. అదే సమయంలో తమపంటను కాపాడుకునే క్రమంలో ఏనుగుల దాడిలో పలువురు రైతులు ప్రాణాలు పోగొట్టుకొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిహారం వేగంగా అందుతోందని బాధిత రైతులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో జిల్లా స్థాయి అధికారుల సమావేశం జరగనుంది.

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 4 షెడ్లులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.71 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,951

తలనీలాలు సమర్పించినవారు: 27,143

వెంకటగిరి కళనేత

వెంకటగిరి, ఆంధ్రజ్యోతి

వెంకటగిరి అనగానే చేనేత గుర్తుకొస్తుంది. మూడు వందల ఏళ్లకు పైగా చేనేత చరిత్ర గలిగిన ఊరు ఇది. 1600, 1700 మధ్య కాలంలో వెంకటగిరి రాజకుటుంబం చేనేత కళాకారులను దూర ప్రాంతాల నుంచి వెంకటగిరికి తీసుకువచ్చారని చెబుతారు. ఏటా రాజులు నిర్వహించే కుస్తీ పోటీల్లో విజేతలకు వెండి జరీతో నేసిన కండువా కప్పేవారు. నేత తలపాగా చుట్టేవారు. వీటిని స్థానికంగానే నేసేవారు. వెంకటగిరి రాజకుటుంబం వస్త్రాలన్నీ ఇక్కడే నేసేవారు. 50 ఏళ్ల కిందటే వెంకటగిరికి చెందిన నేత కళాకారుడు బత్తిన వెంకటసుబ్బయ్య బెంగుళూరు చేనేత సర్వీస్ సెంటర్‌లో పనిచేస్తూ అగ్గిపెట్టెలో పట్టే చీరను నేసి చరిత్ర సృష్టించారు. ఈ చేనేత కళా సంప్రదాయం ఇప్పటికీ వెంకటగిరిలో కొనసాగుతోంది. చీరలు, డ్రెస్‌లతో పాటూ అద్భుత చిత్రాలను వస్త్రంపై నేసి ఆశ్చర్యపరుస్తున్నారు. ఆధునిక సాంకేతికతనూ నేతకు ఈతరం కళాకారులు జోడిస్తున్నారు. వెంకటగిరి నుంచే 12 మంది చేనేత కళాకారులు జాతీయ పురస్కారాలు అందుకున్నారు. ఐదుగురిని సంత్‌కబీర్ అవార్డులు కూడా వరించాయి. ఇక జాతీయ మెరిట్ పురస్కారాలను ఇద్దరు అందుకున్నారు. వెంకటగిరి చేనేతకు వన్నె తెస్తున్న కొంత మంది నేత కళాకారుల పరిచయం.. చేనేత దినోత్సవం సందర్భంగా..



వన్నె తెచ్చిన కళాకారులకు వందనం

జాతీయ అవార్డులు అందుకున్నవారు 12 మంది

ఐదుగురిని వరించిన సంతకబీర్ పురస్కారాలు

ఇద్దరికి జాతీయ మెరిట్ సర్టిఫికెట్లు



కూనా మల్లిఖార్జున్:

12వ ఏట నుంచే మగ్గంలో దిగిన కూనా మల్లిఖార్జున్ 8వ తరగతి వరకే చదువుకున్నారు. సంప్రదాయ నేత విధానానికి ఆధునిక సాంకేతికత జోడించాలన్న ఉత్సాహం ఈయనది. నేతను మరింత సులువు చేయాలన్న ఆలోచనతో చెన్నై, మదురై వంటి ప్రాంతాల్లో తిరిగి స్టాండ్ మగ్గాల పై పట్టు సాధించారు. జాకార్డు , డాబీ, పైటపేటు, అంచు పేటు నేయడంలో సులువైన పద్ధతులు అవలంబిస్తున్నారు. 1996లో పెళ్లి సాంప్రదాయం ఉట్టి పడేలా నేసిన చీరకు జాతీయ అవార్డు లభించింది. అలాగే రెండు నెలల శ్రమతో నేసిన ట్రీ ఆఫ్ లైఫ్ కి సంత్‌కబీర్ అవార్డును అందుకున్నారు.

> నేతకు నూతన సాంకేతికతను జోడించడం అవసరం. నేను తిరిగి నేర్చుకున్నది వంద మందికి నేర్పించా. నా శిష్యులు కూడా జాతీయ అవార్డులు అందుకున్నారు. ఉత్సాహం కన్నా బతుకు ముఖ్యం కదా. నేను కూడా ఇప్పుడు మార్కెట్‌లో డిమాండ్ ఉండే చేరలకే పరిమితం అయ్యా.



> నేను నేసిన నేత చిత్రానికి ఇక్కడి వారు రూ 10 వేలు వెలకట్టారు. అదేచీర బాంబే ఎగ్జిబిషన్‌లో రూ 4లక్షలు పలికింది. నూతన డిజైన్‌లు అమ్ముకొనేందుకు ప్రభుత్వం వేదిక ఏర్పాటు చేయాలి.

లక్కా శ్రీనివాసులు:

గోకులంలో బృందావనం డిజైన్ నేసినందుకు 2015లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకున్న లక్కా శ్రీనివాసులు పదవ ఏట నుంచే చేనేతలో ఉన్నారు. గోడమీద వేలాడదీసే ఈ అందమైన చిత్రం నేయడానికి రెండు నెలలు పట్టింది. అలాగే ఈయన నేసిన లక్ష్మీవృక్షం చిత్రానికి సంత్‌కబీర్ అవార్డును ప్రకటించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రదాని చేతుల ప్రస్తుతం లక్ష్మి వృక్షం వాల్ హ్యాంగింగ్ సంతకబీర్ అవార్డుకు ఎంపికైంది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రదాని చేతుల మీదుగా డిల్లీలో ఈ పురస్కారం అందుకోబోతున్నారు. ఈ చిత్రం నేయడానికి నాలుగు నెలలు పట్టింది.



పట్నం మునిరాజా:

8వ ఏట నుంచే చేనేత వృత్తిలో ఉన్న ఈయన 9వ తరగతికే చదువుకు టాటా చెప్పేసారు. తండ్రి లాగే కొత్త డిజైన్లు నేయాలన్న తపనతో తీగలపై చిలుకలు డిజైన్‌ను చీరకు రెండు వైపులా వచ్చేలా నేసారు. అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా జాతీయ పురస్కారం అందుకున్నారు. నాలుగు నెలలు ఇందుకోసం శ్రమించారు.

> యువతలో చేనేతపై ఆసక్తిని పెంచాలన్నది నా కోరిక. కొత్త డిజైన్ల నేతపై వారికి తగిన శిక్షణ ఇవ్వాలి. ప్రభుత్వం సహకరిస్తే ఈ పని చేయాలని ఉంది.





పట్నం చీరాలరెడి :

బడి చదువులకన్నా విలువైన విద్య కళ రూపంలో ఈయనకు అబ్బింది. 2015లో మూడు నెలల కష్టం, రూ 70 వేల ఖర్చుతో నదీతీరంలో శ్రీకృష్ణ బలరాములు గోవులు మేపే డిజైన్ నేసినందుకు జాతీయ అవార్డు అందుకున్నారు. అలాగే 2017ఓ అనంత పద్మనాభస్వామి చిత్రానికి రాష్ట్రపతి చేతుల మీదుగా సంతకబీర్ అవార్డు అందుకున్నారు.

> మా అబ్బాయితో పాటూ 45 మందికి చేనేతపనిలో శిక్షణ ఇచ్చా. నా శిష్యులు కూడా కొత్త డిజైన్లు నేస్తున్నారు. ఎప్పటికైనా పద్మశ్రీ వరిస్తుందనే నమ్మకంతో ఉన్నా.

సజ్జా వీరయ్య

మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమో చేసిన ఈయన 7వ ఏట నుంచే చేనేతలో ఉన్నారు. 2000లో నాలుగు నెలలు కష్ట పడి నేసిన పురివిప్పిన నెమలి డిజైన్ చీర జాతీయ అవార్డు తెచ్చిపెట్టింది. అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ చేతులు మీదుగా అవార్డు అందుకోవడం మరచిపోలేని అనుభవం అంటున్నారు ఈయన.

> ఆర్థిక పరిస్థితులు అనుకూలించక చేనేతకు దూరమయ్యా. ప్రభుత్వం చేయూతనిస్తే చేనేతలో కొత్త ఒరవడి తీసుకు వచ్చేలా యవతను తయారు చేస్తా.



బోగా రాము

రాము 12 ఏళ్ల వయసు నుంచే నేతపనిలో ఉన్నారు. చదువుకున్నది 6వ తరగతి దాకానే. ఇంటి పరిస్తితులు అనివార్యంగా మగ్గం గుంటలో దించేశాయి. కొత్త డిజైన్లు నేయాలనే ఉత్సాహమే ఈయనకు 1999లో అప్పటి ఉపరాష్ట్రపతి కృష్ణ కాత్ చేతులు మీదుగా జాతీయ అవార్డు అందుకునేలా చేసింది. కర్పూరం డిజైన్ చీరకు ఈ పురస్కారం లభించింది.

> మా నాయన కల జాతీయ అవార్డు సాధించాలన్నది. ఆయనకు సాధ్యం కాలేదు. నేను సాధించి ఆయనకు అంకిత మిచ్చా."





గౌరాబత్తిన రమణయ్య:

బాల్యంలోనే మగ్గం పని నేర్చుకున్నారు. అప్పట్లో మెట్రిక్యులేషన్ పాసయ్యారు. 81 ఏళ్ల వయసులోనూ మగ్గం నేస్తారు. తీగల్లో అమరిన చిలుకలు డిజైన్‌కు జాతీయ అవార్డు లభించింది. దీనిని నేయడానికి 75 రోజులు పట్టింది.





పట్నం మునిబాబు :

4వ తరగతికే చదువు ఆపేసి చేనేతలోకి దిగిన మునిబాబు ఈ కళలో రాణిస్తున్నారు. ఈయన నేసిన గోవర్దనగిరి డిజైన్ చీరకు జాతీయ అవర్డు లభించింది. ఈ చీర నేయడానికి నాలుగు నెలలు పట్టింది.



సంస్కృత భాషా వారోత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులు

సమాజానికి సంస్కృతం దిక్సూచి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సమాజానికి సంస్కృతం దిక్సూచి అని అక్షర పురుషోత్తదామం(డిల్లీ) అధ్యక్షుడు భద్రేశదాస స్వామి పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సంస్కృత భాషా వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బుధవారం చెలికాని అన్నారావు భవనంలో జరిగిన కార్యక్రమంలో భద్రేశదాసు స్వామి అనుగ్రహభాషణం చేశారు. ఇఙ్జికా వీసీ నాగరాజు మాట్లాడుతూ.. భారతీయ విజ్ఞానానికి మూలం సంస్కృతమన్నారు. సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. సంస్కృత భాషను మరింతగా వ్యాప్తి చేయడానికి కృషి జరగాలన్నారు. ప్రఖ్యాత సంస్కృత ప్రొఫెసర్ కొంపెల్ల రామసూర్యనారాయణ, రిజిస్ట్రార్ వెంకటనారాయణరావు, పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎడ్యుకేషన్ విభాంలో అత్యాధునిక క్లాసురూములను వీసీ కృష్ణమూర్తి ప్రారంభించారు. కాగా సంస్కృత యూనివర్సిటీలో గోవింద భగవత్పాదాచార్యుల వాక్యర్థ సభలో భద్రేశ దాసస్వామి, వీసీ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొని మాట్లాడారు.

టీటీడీ డీఎఫ్‌వోకు అదనపు బాధ్యతలు

తిరుమల, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): టీటీడీ డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడికి ఐటీ ఇన్‌ఛార్జ్ జీఎంగా అదనపు బాధ్యతలు అప్పగించారు. టీటీడీ ట్రాన్స్‌పోర్టు జీఎంగా ఉన్న శేషారెడ్డి కొన్నేళ్లుగా ఐటీ ఇన్‌ఛార్జ్ జీఎంగా అదనపు విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల డిప్యూటేషన్‌పై టీటీడీ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా నియమితులైన ఫణికుమార్ నాయుడికి ఐటీ ఇన్‌ఛార్జ్ జీఎంగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అగ్రిగోల్డ్ భూములను పరిశీలించిన సీఐడీ అధికారులు

దొరవారిసత్రం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం అక్కరపాక రెవెన్యూ పరిధిలో ఉన్న 108 ఎకరాల అగ్రిగోల్డ్ భూములను బుధవారం తిరుపతి సీఐడీ అధికారులు పరిశీలించారు. నెల్లూరు సీఐడీ ఆర్‌వో పరిధిలో ఉన్న ఈ భూములను తిరుపతి సీఐడీ ఆర్‌వో పరిధిలోకి తీసుకోవడంతో అధికారులు భూములను పరిశీలించారు. సీఐడీ సీఐ రంగస్వామి, ఎస్ఐ ధరణీధర్, సిబ్బంది, స్థానిక వీఆర్‌వో జ్ఞానేంద్రతో కలిసి భూములను పరిశీలించారు. ఇక్కడ భూములను ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు సీఐడీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అగ్రిగోల్డ్ భూముల్లోకి ఎవ్వరూ ప్రవేశించకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐడీ అధికారులు చెప్పారు.

అమ్మవారికి కానుకగా వెండి దీపాలు



వెండి దీపాలను అందజేస్తున్న రమణారావు

తిరుచానూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారికి కెనడాకు చెందిన రమణారావు బుధవారం రూ.6లక్షల విలువ చేసే వెండి తుంగావాళి దీపాలను ఆలయ అధికారులకు అందజేశారు. 4.14 కిలలో బరువుగల తుంగావాళి (వేలాడే దీపాలు)ని అర్చకుడు బాబుస్వామి, ఏఈవో దేవరాజులు, ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

సకాలంలో విద్యా రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విద్యా రుణాలను సకాలంలో మంజూరు చేయాలని జేసీ శుభం బన్సల్ బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో పలు విశ్వవిద్యాలయాలున్నాయని, విద్యకు సంబంధించిన రుణాలకు ప్రత్యేక ప్రాధాన్యతతో మంజూరు చేయాలని అన్నారు. పీఎంఈజీసీ పథకం కింద మంజూరైన యూనిట్లు అన్ని గ్రౌండింగ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్టాండప్ ఇండియా రుణాలు బ్రాంచ్‌ల వారీగా లక్ష్యాలను అందిపుచ్చుకోవాలని తెలిపారు. రైతులకు క్రాప్‌లోను మంజూరు చేసే సమయంలో పంటలకు ఇన్సూరెన్సు చేయించాల్సిన బాధ్యత బ్యాంకు అధికారులపై ఉందన్నారు. ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, వ్యవసాయశాఖ పీడీ ప్రసాదరావు, మార్కెటింగ్ అధికారి సురేంద్రబాబు, యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్ సామంచి శర్మ, ఎల్డీఎం రవికుమార్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా భవానీ ప్రసాద్

తిరుపతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా పి.భవానీప్రసాద్ నియమితులయ్యారు. పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్‌ను ప్రస్తుతం ఖాళీగా ఉన్న శ్రీకాళహస్తి కమిషనర్ పోస్టులో నియమిస్తూ రాష్ట్ర మున్సిపల్ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఈటీసీలో ఏవోగా మధుసూదన్

శ్రీకాళహస్తిలోని ఈటీసీ (ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్)లో ఖాళీగా ఉన్న ఫ్యాకల్టీ (అగ్రికల్చర్ ఆఫీసర్) పోస్టులో ఏ.మధుసూదన్ నియమితులయ్యారు. వరదయ్యపాళెం మండలంలో ప్రస్తుతం డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం డెప్యుటేషన్‌పై ఈటీసీ ఫ్యాకల్టీగా నియమించింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నిబంధనల మేరకే వినాయక విగ్రహాల ఏర్పాటు

- డీజే సౌండ్లు, సినిమా పాటలతో ఇబ్బందిపెడితే చర్యలు
- ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వినాయక విగ్రహాలను నిబంధనల మేరకు ఏర్పాటు చేయాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. వినాయక చవితి సందర్భంగా తిరుపతిలో విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశాలతోపాటు ఊరేగింపుగా వెళ్లే రోడ్లను అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ భక్తవత్సలం, సీఐ రాంకిషోర్, ఎస్ఐలతో కలసి ఆయన బుధవారం పరిశీలించారు. డీజే సౌండ్లు, సినిమా పాటలతో ప్రజలను ఇబ్బందిపెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశాల్లో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. మద్యం తాగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్లే ఎస్వీనగర్, పద్మావతీనగర్, రాళ్లపల్లి సర్కిల్, ఎమ్మార్‌పల్లె, పూర్ణకుంభం సర్కిల్, లీలామహల్ సర్కిల్, వినాయకసాగర్ చెరువు, లింగాల చెరువులను పరిశీలించి, పలు సూచనలిచ్చారు. ఈ తనిఖీల్లో సీఐలు రామయ్య, ఎస్ఐ లోకేష్‌బాబు పాల్గొన్నారు.



వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశాలపై ఆరా తీస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు